


# పరదేశీ కథలు

- చిట్టే సిద్ధ లలిత



- 106 -

## వైదేహి కథ

**ఆమె తన కథను** చెపుతూనే వుంది. నేను ఊ.. కొడుతూనే వున్నాను. అలా చెప్తూనే నిద్రలోకి జారుకుంది ఆమె. అది కథ కాదు, ఆమె జీవితం. ఆమె కథలో ఎన్ని మలుపులో. విన్న తరువాత నాకు నిద్ర పట్టలేదు.

జీవితంలోని అన్ని దశల్లోనూ కష్టాలే కానుకలుగా స్వీకరించి, అన్ని చోట్లా వివక్షతకు గురయిన ఆమె పేరు వైదేహి. బంగ్లాదేశ్ లోని హిందూ కుటుంబానికి చెందిన మహిళ. ఇరవైయేళ్ళ క్రితం బంగ్లాదేశ్ నుండి కువైట్ కు వచ్చింది. ఓటమిని గెలుపుగా మార్చుకుంటూ ఇక్కడే వుండిపోయింది.

జీవితంలోని ఆటుపోట్లతో ఎంతగా నలిగిపోయినా బాధ పడకుండా తనలాంటి ఒంటరి మహిళలకు ఎందరికో బ్రతికే దారిని చూపిస్తూ, అదే తన గమ్యంగా ఎంచుకుని జీవితాన్ని కొనసాగిస్తోంది. జరిగినదానికి నిరాశ చెందకుండా తృప్తిగా జీవిస్తోంది. సమస్యలకు కృంగిపోక ఎదురొడ్డి పోరాడిన ధీర వైదేహి.

ఆమె కథ నాకు బాధను కలిగించినా ఆమెలోని ఆత్మ విశ్వాసం ఎంతగానో నచ్చింది. మిగిలిన రాత్రంతా ఆమె చెప్పిన కథనే తలచుకుంటూ గడిపేసాను.

వైదేహి మా రూమ్మేట్. మా హోటల్లో ఉద్యోగం చేస్తోంది. ఈ మధ్యనే ఆమె కథను వినడం జరిగింది.

వైదేహి తండ్రికి ఢాకా సిటీలో గాజుల షాపు వుండేది. వైదేహి వాళ్ళమ్మ కూడా షాపులో వుండి భర్తకు తన సహకారాన్ని అందించేది.వైదేహి తరువాత ఇద్దరు చెల్లెళ్ళు పుట్టారు. వైదేహితో కలిపి ముగ్గురు ఆడపిల్లలు. అందరినీ పోషించడానికి అష్టకష్టాలు పడేవాడు తండ్రి నారాయణ్.

పేద కుటుంబం. అందరూ ఆడపిల్లలయినా, అక్కడి పరిస్థితులు అనుకూలించకపోయినా ముగ్గురికీ చదువు చెప్పించేవాడు తండ్రి.

అమ్మానాన్నలు ఏదైనా పనిమీద బయటికి వెళ్ళినప్పుడు, సెలవురోజుల్లో వైదేహి కూడా గాజుల షాపులో

కూర్చునేది.  అలా ఒకరోజు ఆ ప్రాంతంలోని రౌడీ రహీం కళ్ళలో పడింది వైదేహి.
వాడు రోజూ షాపు దగ్గరికి వచ్చి కూర్చుని "నీ కూతుర్ని నాకిచ్చి నిఖా చెయ్ లేకపోతే మీరు ఎవరూ ప్రాణాలతో వుండరు" అని నారాయణ్ ను బెదిరించేవాడు.
ఆ ప్రాంతంలో వాడిని ఎదిరించి బ్రతికే ధైర్యం ఎవరికీ లేదు.   రౌడీ రహీం పచ్చినెత్తురు తాగే రాక్షసుడు. ఇప్పటికి ఎంతమందిని చంపాడో లెక్కలేదు.
నారాయణ్ కు భయమేసింది.
ఒకరాత్రి అందరూ కలిసి ఆ ఊరును, వున్న ఇంటిని వదిలి పారిపోయి ఇండియా బార్డర్ లోని ఒక పల్లెటూరుకు చేరుకున్నారు. తమ ఉనికి తెలియకుండా జాగ్రత్త పడ్డారు.
అక్కడ మంచి సంబంధం చూసి వైదేహికి పెళ్ళి చేస్తే బావుంటుందని భావించాడు నారాయణ్.
ఆ ప్రాంతంలో వెతకగా ఒక హిందూ కుటుంబంలోని కుర్రాడు దొరికాడు. అతడు కువైట్లో ఉద్యోగం చేస్తున్నాడని రెండు నెలలకు అమ్మాయిని కూడా అక్కడికి తీసుకెళ్తాడని వారు నమ్మపలికారు.
ఈడూజోడూ బానే వుందని భావించి పెళ్ళి చేసేసారు. పెళ్ళయిన పదిరోజులకు అబ్బాయి సుగుణ్ కువైట్ దేశం వెళ్ళిపోయాడు.
వైదేహి వీసాకోసం ఎదురు చూస్తూ కువైట్ దేశానికి విమానంలో వెళ్తున్నట్లు, భర్తతో కార్లో తిరుగుతున్నట్లు కమ్మని కలలు కనసాగింది.
కానీ అత్తగారిల్లు కూడా ఆమెకు నరకమే అయింది. పుట్టింటి నుండి కట్నం, బంగారం, వస్తువులు తెమ్మని వాళ్ళు సాధించేవారు. అంతే కాదు ఈ లోపల రహీం కు వైదేహి అడ్రస్ ఎలా తెలిసిందో ఏమో సరాసరి అత్తగారింటికే వచ్చేసాడు.
ఆ రౌడీ వెధవకు భయపడి వాడిచ్చే డబ్బుకు లొంగిపోయిన ఆ అత్తగారు వైదేహిని రహీంతో మాట్లాడమని, ఏకాంతంగా కాలం గడపమని బలవంతం చేసేది. ఎన్నోసార్లు ఆ దుర్మార్గుడి బారినుండి తప్పించుకుంది వైదేహి.
 అదొక నరకం. కానీ ఒకరోజు అత్త, రహీం కలిసి పకడ్బందీగా ప్లాన్ వేసి వైదేహిని గదిలో బంధించారు.
రహీం వచ్చి ఆంబోతులా మీద పడ్డాడు. ఎంత వేడుకున్నా లాభం లేకపోయింది. వాడి బారి నుండి తప్పించుకోవడం అసాధ్యం అయింది. పువ్వులా నలిగిపోయి ఊపిరాడక గింజుకుంటుంటే గర్వంతో వికటాట్టహాసం చేసాడు వాడు.
అంతా సర్వనాశనం అయిపోయిందని వైదేహి ఏడుస్తుంటే, ఏదో సాధించానన్న గర్వంతో మీసం మెలేస్తూ.. "ఏయ్ మీ అత్తకు చెప్పి మటన్ బిర్యాని చేయించు తిని వెళతాను" అంటూ తృప్తిగా కళ్ళు మూసుకుని మంచం

మీద పడుకున్నాడు రహీం. ఇక ఉపేక్షించలేకపోయింది వైదేహి. ఆడది అవసరమయితే అపరకాళిక కాగలదు. కుత్తుకలు తెంచగలదు. గదిలో మూలనున్న కొడవలిని చేతికి తీసుకుని క్రోధంతో వాడి మెడమీద వరసగా దెబ్బలు వేసింది వైదేహి. మంచం రక్తపు మడుగయ్యింది.

తలుపు తీసిన అత్త కెవ్వున కేకలు వేసింది. తరువాత పోలీసులు వచ్చి వైదేహిని తీసుకెళ్ళారు. విషయం తెలిసిన వైదేహి తల్లిదండ్రులు గుండెలు బాదుకున్నారు. తమ బిడ్డకు కలిగిన దుస్థితికి భోరున ఏడ్చారు.

దాదాపూ రెండేళ్ళు కోర్టులో కేసు నడిచింది. సాక్షాధారాలు పరిశీలించిన కోర్టు కేసు కొట్టేసి ఆత్మరక్షణ కోసమే వైదేహి రౌడీ రహీం ను చంపినట్లు నిర్ధారించి ఆరు నెలల జైలుశిక్షను మాత్రమే విధించింది.

ఆర్నెల్లు జైలులో గడిపి ఇంటికి వచ్చింది వైదేహి. ఆ ప్రాంతంలోని వారందరూ ఆమెను వింతగా చూడసాగారు. అక్కడ వుండలేక మరలా స్వంత ఊరికే తిరిగి వెళ్ళారు నారాయణ కుటుంబం.

తల్లిదండ్రులు తమ బిడ్డను కడుపులో దాచుకోగలరు కానీ ఈ సమాజం కాకిలా పొడుస్తుంది. అక్కడా అంతే. వైదేహికి అక్కడ వుండటం సమంజసం కాదనిపించింది. ఈ మనుషులకు దూరంగా ఎక్కడికైనా పారిపోవాలనిపించింది. కువైట్లో వున్న భర్తకు ఫోన్ చేసి విషయం చెప్పి తొందరగా వీసా పంపించమని వేడుకుంది.

వాడు నవ్వి "నువ్వు హంతకివి. ఇప్పుడు నిన్ను నా భార్యగా నేను భావించడం లేదు. ఇక నన్ను మర్చిపో. నా లైఫ్ ఇక్కడ సెటిల్ అయిపోయింది. ఈ మధ్యనే నేను ఇక్కడే కువైట్ లో పెళ్ళి చేసుకున్నాను. నా భార్య నీతూతో హాయిగా వున్నాను. నీ బ్రతుకు నువ్వు చూసుకో" అని తేల్చి చెప్పాడు.

ఏమీ మాట్లాడలేకపోయింది వైదేహి. చుట్టూ వున్న అమ్మలక్కలు "ఇది రహీం ను చంపి జైలుకు వెళ్ళి వచ్చింది. మరి దీని చెల్లెళ్ళకు పెళ్ళి అవుతుందా? ఇలాంటి వాళ్ళను ఎవడు చేసుకుంటాడు. ఇక వీళ్ళకి పెళ్ళవడం కష్టమే" అని ముఖం ముందే మాట్లాడేవారు.

తన తప్పేమిటో అర్థంకాక, ఏం చెయ్యాలో, ఎక్కడికి పారిపోవాలో తెలియక కుమిలి కుమిలి ఏడ్చింది వైదేహి. తల్లిదండ్రులు కూడా జరిగిన సంఘటనలతో కృంగిపోయారు.

ఎలాగైనా సరే కువైట్ కు వెళ్ళాలని, గతమంతా మరిచిపోయి అక్కడ ప్రశాంతంగా జీవించాలని నిశ్చయించుకుంది వైదేహి. పట్టుదలగా వంటిపైనున్న బంగారాన్ని అమ్మేసింది.

ఏజెంటును కలిసి పాస్పోర్ట్, వీసా తెప్పించుకుని కువైట్ కు వచ్చింది.

ఇక్కడ ఒక క్లీనింగ్ కంపెనీలో వర్కర్ గా పనికి కుదిరింది వైదేహి. చిన్న ఉద్యోగమయినా నాలుగేళ్ళు బాగా

కష్టపడి పని చేసింది వైదేహి. వైదేహి పని నచ్చడంతో ఆమెకు ఆ కంపెనీలో సూపర్ వైజర్ గా ప్రమోషన్ ఇచ్చారు. సంతోషించింది వైదేహి. తనలాంటి దగా పడిన మహిళలకు సహాయం చేయాలనుకుంది. ఎందరికో వీసాలు పంపించి కువైట్ కు పిలిపించి ఆదుకుంది వైదేహి. ఎంతోమంది బ్రతుకుల్లో వెలుగును నింపింది. అదే తన కర్తవ్యమనుకుని ఉత్సాహంగా ఆ బాటలో ముందుకు సాగింది.

ఇప్పుడు కువైట్ లో అక్కా, చెల్లీ అంటూ వైదేహిని అభిమానించే వారికి లెక్కేలేదు. తండ్రికి కూడా డబ్బును పంపించి అతడి పేదరికాన్ని దూరం చేసింది. బాగా చదువుకొని ఉద్యోగాలు తెచ్చుకోవాలని చెల్లెళ్ళకు హితబోధ చేసింది. ఆ తరువాతే తగిన సంబంధాలు చూసి వారికి పెళ్ళి చేయమని తండ్రికి చెప్పింది.

ఈ లోపల కువైట్ లో మంచి ఫైవ్ స్టార్ హోటల్లో ఉద్యోగావకాశం వచ్చింది వైదేహికి. ఆ క్లీనింగ్ కంపెనీలో రిజైన్ చేసి ఇక్కడ కంపెనీలో విధుల్లో చేరింది. తన ప్రతిభతో ఇక్కడ కూడా మంచిపేరు సంపాదించుకుంది వైదేహి.

ఒకరోజు సుగుణ్ వైదేహిని వెతుక్కుంటూ వచ్చి కాళ్ళ మీద పడ్డాడు. "నీతూ తనను వదిలేసి వెళ్ళిపోయిందని ఇపుడు తను ఒంటరిగా వున్నానని వైదేహి ఒప్పుకుని వచ్చి తనతో కాపురం చేయాలని ప్రాధేయపడ్డాడు. జరిగింది మర్చిపోయి క్షమించమన్నాడు."

"ఛీ పో.. జన్మలో నీ ముఖం నాకు చూపించకు" అని సెక్యూరిటీకి చెప్పి వాడ్ని బయటికి తోయించింది వైదేహి.

కాలం ఎవరి కోసమూ ఆగదు. అలా పదేళ్ళు గడిచాయి.

ఇన్నేళ్ళలో ఇంతవరకూ ఒక్కసారి కూడా వైదేహి బంగ్లాదేశ్ కు వెళ్ళనే లేదు. వెళ్ళాలనే కోరిక కూడా ఆమెకు లేదు.

"జీవితంలోని ఏ దశలోనూ తను సుఖంగా, సంతోషంగా లేనని కువైట్ కు వచ్చి తనలాంటి అభాగినులకు సహాయం చేసినప్పుడే సంతృప్తిగా వుందని, ప్రాణమున్నంతవరకూ పదిమందికి సహాయం చేయడమే తన ధ్యేయం" అని చెప్పింది వైదేహి.

మంచిపనుల్లో సంతోషాన్ని వెతుక్కుంటూ ఈ ఎడారి దేశంలో తన జీవితాన్ని హాయిగా గడుపుతోంది వైదేహి.

నిజంగా వైదేహి హంతకురాలా? ఎవరు హంతకులు..?తనని వేధించిన ఈ సమాజమా? రక్షణ ఇవ్వకపోగా స్వార్థం కోసం ఆమెను తార్చాలని చూసిన ఆమె అత్తగారా? ఆలోచిస్తూ ఏ తెల్లవారుఝామునో నిద్రపోయాను నేను.

దాదాపూ ఒక నెల రోజుల తర్వాత ముసలివాడయిన తండ్రి నారాయణ్ అనారోగ్యంతో హాస్పిటల్ లో చేరాడని వైదేహికి కాల్ వచ్చింది. ఇక ఇన్నేళ్ళ తర్వాత ఆమెకు బంగ్లాదేశ్ కు వెళ్ళక తప్పలేదు. నెలరోజులు సెలవు తీసుకుని తండ్రిని చూడాలని ఆత్రుతగా బయలుదేరి వెళ్ళింది వైదేహి. కడసారి చూపు మాత్రమే మిగిలింది. తండ్రికి అంత్యక్రియలు పూర్తి చేసి తిరిగి కువైట్ రావడానికి టికెట్ బుక్ చేసుకుంది వైదేహి.

తీరా ఎయిర్పోర్ట్ కు వచ్చాక అక్కడి ఆఫీసర్లు "ఆమె ఎక్కడికీ వెళ్ళడానికి వీల్లేదని, ఆమె భర్త ఆమెపై కేసు ఫైల్ చేసాడని, అవన్నీ క్లియర్ అయేంతవరకూ ఇక్కడే వుండాలని" చెప్పి వెనక్కి పంపించారు.

నిర్ఘాంతపోయింది వైదేహి. ఆమె కష్టాలకు అంతం లేదనిపించింది.

వాడితో మరలా కోర్టుకు ఎక్కి విడాకులు తీసుకునే సరికి రెండేళ్ళ కాలం గడిచి పోయింది. ఇక్కడ కువైట్ లో ఉద్యోగం ఎప్పుడో పోయింది. సెలవు ముగిసాక తిరిగి వచ్చి బాధ్యతలలో చేరకపోవడంతో మూడునెలలు చూసి ఆమెను టెర్మినేట్ చేసేసారు.

ఇక చాలనుకుంది. బంగ్లాదేశ్ లోనే తల్లికి తోడుగా వుండిపోయి సమాజసేవ చేయాలి అని నిర్ణయించుకుంది వైదేహి. తను సంపాదించిన డబ్బుతో అక్కడే ఒక వృద్ధాశ్రమం నెలకొల్పింది వైదేహి. ఇప్పుడు అక్కడి జనాలు పాత సంగతులు మర్చిపోయారు. డబ్బు సంపాదించుకుని వచ్చిన వైదేహి చుట్టూ ఈగల్లా చేరారు. కాకులకు ఎంగిలి మెతుకులు విదల్చడం ఆమెకు పెద్దపని కాదు.

అన్ని కథలకూ ముగింపు వుండకపోవచ్చు కానీ కొన్ని జీవితాలకు ఒక అర్థం, పరమార్థం వుందనిపిస్తుంది వైదేహిని చూస్తే.

జీవితంలోని యుద్ధాలెన్నో గెలిచిన ధీర వైదేహి. ఆమెది కథ కాదు, స్ఫూర్తిని కలిగించే ఒక గాథ

*(మరోకథ వచ్చేనెలలో)*

Post your comments